## క్లుప్తంగా

### శైలజానాథ్‌కు శుభాకాంక్షల వెల్లువ



సాకే శైలజానాథ్‌ను సన్మానిస్తున్న నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు

శింగనమల: శింగనమల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా మాజీ మంత్రి సాకే శైలజానాథ్‌ను నియమించడంతో శనివారం నియోజకవర్గంలోని బుక్కరాయసముద్రం, నార్పల, పుట్లూరు, శింగనమల మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి సాకే శైలజానాథ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసి, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించుకుందామన్నారు. ఆమేరకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేద్దామన్నారు.

### లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాటం

గుంతకల్లుటౌన్: బహుళజాతి కంపెనీలకు అనుకూలంగా మోదీ సర్కారు అమలు చేస్తున్న లేబర్ కోడ్‌లకు వ్యతిరేకం పోరాడుదామని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) జిల్లా కార్యదర్శి సురేష్, న్యాయవాది ఓపీడీఆర్ నాగరాజు పిలుపునిచ్చారు. కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని కసాపురం రోడ్డు ఆటోస్టాండ్, భగత్‌సింగ్ కాలనీ, రామిరెడ్డి కాలనీల్లో ఐఎఫ్‌టీయూ జెండాను ఎగురవేసి వందనం చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు రఘునాథరెడ్డి, రామాంజినేయులు, జిలాన్, రామ్‌దాస్, షేక్షా తదితరులు పాల్గొన్నారు.

### గొడవలకు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న ఏఎస్పీ రోహిత్‌కుమార్

తాడిపత్రిటౌన్: గొడవలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ రోహిత్‌కుమార్ హెచ్చరించారు. తాడిపత్రి మండలంలోని ఆలూరు గ్రామంలో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో కలియ తిరుగుతూ సమస్యలపై ఆరా తీసారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించి గ్రామంలో ఎలాంటి గొడవలకు పాల్పడవద్దని సూచించారు. పిల్లలను బాగా చదివించుకుని వారి ఉన్నతికి కృషి చేయాలన్నారు. ఏదైనా సమస్య వస్తే పోలీసులను సంప్రదించాలన్నారు. అనవసరమైన గొడవలకు పాల్పడి గ్రామంలో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ శివగంగాధర్‌రెడ్డి, ఎస్‌ఐ ధరణి, సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రయాణికులు జాగ్రత్తలు పాటించాలి



ప్రయాణికులకు జ్యూస్ ప్యాకెట్లు అందజేస్తున్న మమతాగుప్తా

గుంతకల్లు: రైలు ప్రయాణికులు వేడి నుంచి ఉపశమనం పొందడానికి తరుచూ నీరు, మజ్జిగ, ఇతర్రత పానీయాలు సేవించి ఆరోగ్యం కాపాడుకోవాలని దక్షిణ మధ్య రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ గుంతకల్లు డివిజన్ అధ్యక్షురాలు, డీఆర్‌ఎం సతీమణి మమతాగుప్తా సూచించారు. శనివారం స్థానిక రైల్వేస్టేషన్‌లో ఆర్గనైజేషన్‌తోపాటు భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో హైడ్రేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు వాటర్ బాటిళ్లు, మజ్జిగ ప్యాకెట్లతోపాటు ఇతర శీతల పానీయాలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సభ్యులుతోపాటు స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

### యువకుడికి గాయాలు



గాయపడిన అవినాష్

గుత్తి రూరల్: మండలంలోని కరిడికొండ గ్రామ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడి అవినాష్ అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు. అవినాష్ హైదరాబాదు నుంచి బెంగళూరుకు బైక్‌లో బయలుదేరాడు. కరిడికొండ గ్రామ శివారులో వేగంగా వెళ్తున్న బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో అతడి ఎడమచేతి మణికట్టు తెగిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# అన్నదాత కుదేలు

- గాలీవానకు మామిడి, అరటి రైతులకు రూ.కోట్ల నష్టం
- ట్రాన్స్‌కోకు రూ.10 లక్షల నష్టం



తాడిపత్రి మండలంలో నేలకొరిగిన అరటి తోటను చూపుతున్న రైతు

తాడిపత్రి రూరల్: తాడిపత్రి ప్రాంతంలో అకాల వర్షాలు, గాలీవాన బీభత్సానికి కరువు రైతు కుదేలయ్యాడు. అన్నదాతలు దొరికిన చోటల్లా అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పంటలు, పండ్ల తోటలకు పెట్టుబడి పెట్టారు. వాతావరణ పరిస్థితుల వల్ల పలు చోట్ల పంటలు, పండ్లతోటలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో దిగుబడులు తగ్గాయి. ఇలాంటి సమయంలో గాలీవానకు ఆరుగాలం పండించిన పంటలు, పండ్ల తోటలు నేలపాలయ్యాయి. దీంతో చేతికొచ్చిన పంట నేలపాలవడంతో అన్నదాతలు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఈ వారంలో రెండు సార్లు అకాల వర్షాలు కురవడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.

**అరటి తోటలపై ప్రకృతి కన్నెర్ర..**

తాడిపత్రి ప్రాంతంలోని పలు మండలాల్లో అరటితోటలపై ప్రకృతి విలయం సృష్టించింది. కోట్లాది రూపాయల నష్టంపై రైతులు జీవచ్ఛవమయ్యారు. గాలీవాన బీభత్సవానికి తాడిపత్రి మండలంలోని ఆలూరు, వెలమకూరు, పెద్దపప్పూరు మండలంలోని పసలూరు, యల్లనూరు మండంలోని వెన్నపూసపల్లి, పుట్లూరు మండలంలోని ఎల్లుట, జంగంరెండ్డిపేట, మడ్డిపల్లి, కొండుగారికుంట, రంగినేపల్లి, రంగరాజుకుంట, కడవకల్లు తదితర గ్రామాల్లో అరటి నేలకొరిగింది. ఈ ఏడాది మార్చి నెలలో వచ్చిన అకాల వర్షాలు, ప్రచండ గాలులతో కేవలం పుట్లూరు మండలంలో దాదాపు రూ.6 కోట్లకుపైగా పంట నష్టం జరిగిందంటే ఏ స్థాయిలో రైతులు బజారున పడ్డారో అర్థమవుతోంది. సాధారణంగా ఏడాదికి అరటికి దాదాపు లక్ష రూపాయల వరకూ పెట్టుబడి, ఇతర ఖర్చులు వస్తాయి. ప్రస్తుతం ఉన్న రేట్ల ప్రకారం ఎకరాకు 15 టన్నుల వరకు దిగుబడి వచ్చినా పెట్టుబడి పోగా లక్ష రూపాయలకుపైగా ఆదాయం వచ్చేది. పంట నష్టంతో ఆదాయం రాకపోగా పెట్టుబడి సహా రెండు లక్షల రూపాయలకుపైగా రైతులు కోల్పోయారు.

**మామిడికి నష్టం..**

అకాల వర్షాలు, గాలులతో తాడిపత్రి మండలంలోని పలు గ్రామాల్లో మామిడికి నష్టం ఏర్పడింది. మండలంలోని ఆలూరు, చుక్కలూరు, గంగాదేవిపల్లి, వెంకటరెడ్డిపల్లి, వెలమకూరు, బోడాయిపల్లి తదితర గ్రామాల్లో మామిడి కాయలు నేలపాలయ్యాయి. పక్వానికి వచ్చిన కాయలు నేలపాలు కావడంతో రైతులు నష్టపోయారు. ప్రస్తుతం సీజన్ కావడంతోపాటు అరకొర దిగుబడి వల్ల మామిడి కాయలకు డిమాండ్‌తో పాటు ధర కూడా పలుకుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో అకాల వర్షాలతో మామిడికి నష్టం కలగడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. పక్వానికి రానీ కాయలు సైతం రాలిపోయాయని రైతులు వాపోతున్నారు. తాడిపత్రి మండలంలోని పలు చోట్ల మామిడి తోటల్లోని కాయలను వ్యాపారులు గుత్తకు తీసుకున్నారు. కాయలు నేలపాలు కావడంతో వ్యాపారులు నష్టం వచ్చిందంటూ ఎక్కడ గుత్తలో కోత విధిస్తారోనన్న భయం రైతులను వెంటాడుతోంది.

**నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు..**

తాడిపత్రి పట్టణ, రూరల్ మండలాల్లో అకాల వర్షాలు, గాలి బీభత్సవంతో టాన్స్‌కోకు దాదాపు రూ.10 లక్షల వరకు నష్టం వాటిల్లింది. తాడిపత్రి మండలంలోని చుక్కలూరు, అయ్యవారిపల్లి, సజ్జలదిన్నె, రావివెంకటాంపల్లి, తిమ్మాపురం, యాడికి, పెద్దపప్పూరు మండలాల్లో ట్రాన్స్‌పార్మర్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ట్రాన్స్‌పార్మర్లలోని అయిల్ నేలపాలుకాగా, కాయిల్స్ దెబ్బతిన్నాయి. విద్యుత్ తీగలు దెబ్బతినడంతో కొత్తవాటిని ఏర్పాటు చేయాల్సి వచ్చింది. తాడిపత్రి పట్టణంలో పలు చోట్ల భారీ చెట్లు నేలకొరగడంతో పాటు విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లు, స్తంభాలు దెబ్బతిన్నాయి. తాడిపత్రి మండలంలో విస్తరించిన పారిశ్రామిక రంగానికి చెందిన పలు టాన్స్‌పార్మర్లు మరమ్మతులకు గురయ్యాయి.

**బీకేఎస్‌లో రూ.80 లక్షల నష్టం**



దండువారిపల్లిలో రాలిన మామిడి కాయలను చూపుతున్న రైతు

బుక్కరాయసముద్రం: మండలంలో శుక్రవారం రాత్రి గాలీ వానకు పండ్ల తోటలు దెబ్బన్నాయి. మండలంలో నీలారెడ్డిపల్లి, రెడ్డిపల్లి, కొర్రపాడు, సంజీవపురం, దండువారిపల్లి లో 41 మంది రైతులకు సంబంధించి అరటి 100 ఎకరాలు, మామిడి 20 ఎకరాల్లో దెబ్బతిన్నాయి. మండలంలో దాదాపు రూ.80 లక్షల వరకు పంట దెబ్బతిన్నట్లు బాధిత రైతులు వాపోయారు. మండల ఉద్యాన శాఖ అధికారి శైలజా, సిబ్బంది దెబ్బతిన్న పంటలను శనివారం పరిశీలించారు. రైతుల వివరాలు, పంటల నష్ట వివరాలను నివేదికలు తయారు చేసి జిల్లా ఉన్నత అధికారులకు పంపుతున్నట్లు ఆమె తెలిపారు.

**రూ.10 లక్షలు నష్టపోయా**



అకాల వర్షాల కారణంగా అరటి రూ.10 లక్షలు నష్టపోయా. నాలుగు ఎకరాల్లో ఐదు వేల అరటిచెట్లు సాగు చేశా. పెట్టుబడి రూపంలో రూ.5 లక్షలు ఖర్చు పెట్టా. పంట చేతికి వచ్చిందన్న ఆశతో అమ్మకానికి పెట్టా. అకాల వర్షాలు ఆశలను అడియాసలు చేసింది. పంట నేలకొరిగి అపార నష్టాన్ని మిగిల్చింది. – జగదీష్, రంగమనాయునిపల్లి, పుట్లూరు మండలం

**పంట నష్టంపై అంచనా వేశాం**



తాడిపత్రి పరిసర మండలాల్లో కురిసిన వర్షాల వల్ల దెబ్బతిన్న పండ్లతోటలపై అంచనాలు తయారు చేశాం. దెబ్బతిన్న గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడి వివరాలు సేకరించాం. ప్రధానంగా అరటి పంటకు ఎక్కువ నష్టం జరిగింది. పరిహారం కోసం ఉన్నతాధికారులకు అంచనాలతో కూడిన నివేదికను పంపుతాం. – ఉమాదేవి, ఉద్యానవనశాఖ అధికారి, తాడిపత్రి

### నలుగురిపై కేసు నమోదు

పామిడి: మండలంలోని కత్రిమల గ్రామంలో వడ్డే నల్లప్ప, ఆయన తమ్ముడు వడ్డే రామకృష్ణపై అదే గ్రామవాసులైన శివారెడ్డితో పాటు ఆయన వర్గీయులైన మరో నలుగురుపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఇశ్రాయేల్ శనివారం తెలిపారు. వడ్డే నల్లప్ప, శివారెడ్డికి ఇంటిముందు స్థలం, నల్లప్ప ఇంటిముందు మురుగు ప్రహహించటం, చెత్తాచెదారం వేయడంపై ఘర్షణ నెలకొంది. శివారెడ్డి, ఆయన వర్గీయులు దౌర్జన్యంగా వడ్డే నల్లప్ప ఇంట్లోకి దూరి నల్లప్పతో పాటు ఆయన తమ్ముడు వడ్డే రామకృష్ణపై కట్టెలతో దాడి చేశారు. దాడిలో నల్లప్ప, రామకృష్ణ గాయపడ్డారు, క్షతగాత్రుడు రామకృష్ణ అనంతపురం సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

### వాల్మీకులు చైతన్యం కావాలి



మాట్లాడుతున్న మాజీ చైర్మన్ పొగాకు రామచంద్ర

యాడికి: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వాల్మీకులు చైతన్యం కావాలని వైఎస్సార్‌సీపీ వాల్మీకి కార్పొరేషన్ మాజీ చైర్మన్ పొగాకు రామచంద్ర పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం మండలంలోని రాయలచెరువు గ్రామంలో వాల్మీకులతో కలసి వాల్మీకి విగ్రహానికి పూల మాలలు వేశారు. అనంతరం ఆయన వాల్మీకులతో కలిసి ప్రత్యేక సమావేశం ఏర్పాటు నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు, పరిష్కార మార్గాలపై చర్చించారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘ నాయకులు శివయ్య, రామ్మోహన్, నాగరాజు, కేశవ, క్రిష్ణ, రామానాయుడు పాల్గొన్నారు.

### 7 నుంచి బండిశూల తిరునాల



గ్రామదేవతలు సుంకలమ్మ, ముత్యాలయ్య విగ్రహాలు

పెద్దవడుగూరు/పామిడి: పెద్దవడుగూరు మండలంలోని కాశేపల్లి, గుత్తిఅనంతపురం, పామిడి మండలం రామరాజుపల్లి సమక్షంలో జరుగనున్న బండిశూల తిరునాల బుధవారం ప్రారంభం కానున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. 7న బుధవారం ఉదయం తిరునాల ప్రారంభమై 8న గుత్తి అనంతపురం నుంచి కాశేపల్లి మీదుగా రామరాజుపల్లికి శూలబండిని ఎద్దులతో లాగిస్తారు. 9వ తేదీ రామరాజుపల్లి గ్రామం నుంచి కాశేపల్లి మీదుగా గుత్తిఅనంతపురం లో ఉన్న అమ్మవారి ఆలయం వద్దకు బండిని లాగిస్తారు. 10న గుత్తి అనంతపురం గ్రామం వద్ద సుంకులమ్మ ఆలయం వద్ద నిండు తిరునాల నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయం చుట్టూ శూలబండితో ప్రదక్షిణలు చేయించి రామరాజుపల్లికి బండిని తీసుకెళ్తారు. 11న ఆదివారం అమ్మవారి ఆలయం వద్ద భక్తులు మొక్కులు తీర్చుకోవడంతో తిరునాల ముగుస్తుందని గ్రామ పెద్దలు తెలిపారు.

## ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకుడు ఈశ్వరయ్య

గుంతకల్లు: కూటమి ప్రభుత్వం ఆటోడ్రైవర్లుకు ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఏఐటీయూసీ అనుబంధ సంస్థ ఏపీ ఆటోడ్రైవర్ యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలోని మస్తానయ్య దర్గా నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకూ ఆటోల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు దాసరి శ్రీనివాసులు, ఏఐటీయూసీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు సురేష్, ఈశ్వరయ్య మాట్లాడుతూ ఓట్ల సమయంలో మాత్రమే గుర్తుకు వచ్చే ఆటోడ్రైవర్లు అధికారం చేపట్టిన తరువాత ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. వీరి దుర్భర జీవితాలను దృష్టిలో ఉంచుకుని సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, సల్థాలు ఇవ్వడంతోపాటు ఇళ్లు నిర్మించాలన్నారు. ఈ నెల 20 దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఆటోడ్రైవర్లు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐడీయూ కార్యదర్శి శివ, నాయకులు ఎస్ఎండీగౌస్, మల్లయ్య, వంశీకృష్ణ, నందు, వేణు తదితరులు పాల్గొన్నారు.

**8న ద్విచక్ర వాహనాల వేలం**

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మద్యం కేసుల్లో పట్టుబడిన మూడు ద్విచక్ర వాహనాలకు ఈ నెల 8న ఉదయం 10 గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు సీఐ నాగ సునీత రాణి తెలిపారు. ఆసక్తిగల వారు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలన్నారు.

**ఆక్రమిత స్థలాల క్రమబద్ధీకరణకు చర్యలు**

గుంతకల్లుటౌన్: రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ 30 ప్రకారం పట్టణంలో ఎలాంటి అభ్యంతరాల్లేని ప్రభుత్వ స్థలాల్లో నిర్మించుకున్న ఇళ్ల నిర్మాణాల క్రమబద్ధీకరణకు రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. శనివారం పట్టణంలోని హనుమేష్‌నగర్‌లో తహసీల్దార్ రమాదేవి, రెవెన్యూ, మున్సిపల్ ప్లానింగ్ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి ఇళ్ల నిర్మాణాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను గుర్తించి, వివరాలను సేకరించారు.

**సమ్మె నోటీసు**

తాడిపత్రి రూరల్: ఈ నెల 20న జరుగనున్న దేశ వ్యాప్త సమ్మెపై శనివారం ఐసీడీఎస్ సీడీపీఓ సాజిదాబేగంకు అంగన్‌వాడీ యునియన్ నాయకులు శంకరమ్మ, హైమావతి, సీఐటీయూ నాయులు ఉమాగౌడ్, నాగరాజు నోటీసు అందజేశారు. వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

**లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో చోరీ**

పుట్లూరు: మండలంలోని గరుగుచింతలపల్లి సమీపంలో ఉన్న లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో (తుంబుర కోన) శుక్రవారం రాత్రి చోరీ చేసుకుంది. ఆలయంలో ఉన్న సీసీ కెమెరాలను పగులగొట్టిన దుండగులు దాదాపు 350 గ్రాముల వెండి ఆభరణాలను అపహరించారు. అర్చకుల ద్వారా విషయం తెలుసుకున్న సీఐ సత్యబాబు, ఎస్‌ఐ వెంకట నరసింహ శనివారం చోరీ జరిగిన ఆలయాన్ని పరిశీలించారు. క్లూస్ టీం ద్వారా తనిఖీలు చేపట్టారు.

### సంక్షిప్త వార్తలు

**గుండెపోటుతో వ్యక్తి మృతి**



మృతుడు సాయినాథ్

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డులో శుక్రవారం రాత్రి ఓ హోటల్లో సాయినాథ్(34) అనే వ్యక్తి టీ తాగుతున్న సమయంలో కుప్పకూలి కిందపడి మృతి చెందాడు. పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన సాయినాథ్ తన స్నేహితులతో కలిసి టీ తాగడానికి హోటల్‌కు వెళ్లాడు. అక్కడ టీ తాగుతున్న సమయంలో ఉన్న ఫళంగా కుప్పకూలి కింద పడ్డాడు. వెంటనే స్నేహితులు ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే సాయినాథ్ మృతి చెందినట్లు నిర్ధారించారు.

**రైల్వే విశ్రాంత ఉద్యోగి మృతి**



జింకా రంగన్న(ఫైల్)

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని బండిమోటు వీధికి చెందిన రైల్వే విశ్రాంత ఉద్యోగి, ప్రముఖ టెన్నిస్ క్రీడాకారుడు జింకా రంగన్న(68) శనివారం ఆకస్మికంగా మృతి చెందాడు. గుండెపోటుతో మృతి చెంది ఉండవచ్చని వైద్యులు తెలిపారు. జింకా రంగన్న మృతిపై బలిజ సంఘం నాయకుల సంతాపం ప్రకటించారు.

**వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి**



మదన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

పామిడి: మండలంలోని ఖాదర్‌పేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎస్. మదన్‌మోహన్‌రెడ్డి(59) శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతిపై మండలంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు సంతాపం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తనయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు వై.భీమ్‌రెడ్డి తదితరులు మృతదేహానికి నివాళులర్పించారు.

### 'మురుగు' .. రోడ్డుపై పరుగు!



కొత్తూరు కాలనీలో రోడ్డుపైఎ పారుతున్న మురుగు నీరు

గుత్తి: పట్టణంలోని కొత్తూరులో మురుగు రోడ్లపై పారుతోంది. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా ఉండటంతో మురుగుంతా రోడ్లపై నిలుస్తూ దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ శానిటేషన్ అధికారులు స్పందించి మురుగునీటిని తొలగించడానికి చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

## నాపరాళ్ల వ్యర్థాల తొలగింపు



జేసీబీతో రాళ్లను తొలగిస్తున్న పోలీసులు

తాడిపత్రిటౌన్: మండలంలోని రావివెంకటాంపల్లి సమీపంలో ఉన్న కమ్మ భవన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు వదిలిన నాపరాళ్లను శనివారం పోలీసులు జేసీబీతో తొలగించారు. అయితే నాపరాళ్ల వ్యర్థాలు ఎవరు వదిలారు? ఎందుకు వదిలారు? అన్న సందేహాలు పట్టణంలో తీవ్ర చర్చాశనీయంగా మారింది. ఆదివారం తిమ్మంపల్లి నుంచితాడిపత్రికి వస్తున్న తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిపై మార్గ మధ్యలో దాడికి ఉపయోగించేందుకే టీడీపీ గుండాలు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడి ఉంటారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అలాంటి వ్యర్థాలనే రెండు రోజుల క్రితం తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి ఇంటి ఎదుట ఉన్న పాతశాల మైదానంలో గుట్టలు గుట్టలుగా నిల్వచేశారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటిపై దాడి చేసేందుకు నిల్వ చేసినట్లు భావించి రాత్రికి రాత్రే పోలీసులు నాపరాళ్ల వ్యర్థాల గుట్టలను తొలగించారు. అవి కూడా ఇలాంటి రాళ్ల గుట్టనే కావడం.. రాళ్ల గుట్టకు సమీపంలోనే కమ్మభవన్ ఉండటం అనుమానాలకు బలం చేకూర్చుతోంది. అయితే పోలీసులు మాత్రం గుర్తు తెలియని వ్యక్తులు వదిలిన నాపరాళ్ల వ్యర్థాల వల్ల వాహన ప్రమాదాలు చోటు చేసుకుంటాయని, అందుకే రాళ్ల గుట్టను తొలగిస్తున్నట్లు 'సాక్షి'కి తెలిపారు.

## నిధులు రాకుండా అడ్డుకోవడం దారుణం

గుత్తి/పెద్దపప్పూరు/గార్లదిన్నె: జిల్లాలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం తపిస్తున్న ఆర్డీటీకి విదేశాల నుంచి నిధులు రాకుండా కేంద్ర ప్రభుత్వం అడ్డుకోవడం దారుణమని ఆ సంస్థ సభ్యులు మిద్దె ఓబులేసు, రామాంజనేయులు, గద్దల కార్తీక్ మండిపడ్డారు. గుత్తిలో ఆర్డీటీ సభ్యులు శనివారం ప్రజలతో కలిసి గాంధీ సర్కిల్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు స్పందించి ఆర్డీటీకి నిధులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సేవ్ ఆర్డీటీ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీటీ సభ్యులు రామదాసు, మల్లి తదితరులు పాల్గొన్నారు.

- పెద్దపప్పూరులో శనివారం ఆర్డీటీని కాపాడుకుందాం కార్యక్రమంలో భాగంగా 160 మంది ఆర్డీటీ సంఘం సభ్యులు అంబేడ్కర్ కాలనీలోని ఆర్‌డీడీపీ కమ్యూటీహాలులో ఫెర్రర్ విగ్రహానికి పూలవేశారు. ఎమ్మార్పీస్ జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ టి.ఆదినారాయణ మాట్లాడుతూ ఆర్డీటీ సహకారంతో ఎంతో మంది జీవితాలు మెరుగుపడ్డాయన్నారు. మరింత మంది జీవితాల్లో వెలుగులు చూడాలంటే ప్రధాని మోదీ ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యువల్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.
- గార్లదిన్నెలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆర్డీటీ సేవలు కొనసాగించేలా చూడాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేటర్ యాక్ట్ అనుమతులు పునరుద్ధరించాలన్నారు.లేని పక్షంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కదిరెప్ప, కుళ్లాయప్ప, నాగరాజు, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తాడిపత్రిటౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పట్టణానికి చెందిన కిరణ్‌కుమార్ (55) ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తుండేవాడు. శుక్రవారం బుగ్గ గ్రామ సమీపంలో బుగ్గ–తాడిపత్రి ప్రధాన రహదారిపై స్పీడ్ బ్రేకర్ల వద్ద అదుపుతప్పి కిందపడ్డాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తర్వాత అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శనివారం అక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య శివలక్ష్మీ, ఇద్దరు పిల్లలున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

### శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

గుంతకల్లుటౌన్/పెద్దపప్పూరు: వేసవి సెలవుల సందర్భంగా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గుంతకల్లు, పెద్దపప్పూరు గ్రంథాలయాధికారులు కమ్మన్న, శంకర్ సూచించారు. శనివారం విద్యార్థులకు వ్యాచరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు.

### ఎట్టకేలకు మస్టర్ల తనిఖీ




సాక్షి ఎఫెక్ట్..

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ, ఈసీ

యల్లనూరు: మండలంలో ఉపాధి పనులకు సంబంధించిన మస్టర్లను అధికారులు తనిఖీ చేపట్టారు. సాక్షి పత్రికలో ఉపాధి సిబ్బంది ఇష్టారాజ్యం అన్న కథనానికి స్పందించిన అధికారులు క్షేత్రస్థాయిలో పరుగులు తీశారు. చింతకాయమంద, బుక్కాపురం గ్రామాల్లో ఉపాధి పనులను ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వాసుదేవరెడ్డి, ఇన్‌చార్జ్ ఏపీఓ, ఈసీ సత్యమూర్తి పనులను పరిశీలించారు. మస్టర్లల్లో పనులకు హాజరైన కూలీల వివరాలను నమోదు చేసి, గైర్హాజరైన కూలీలకు హాజరు వేయలేదు. అనంతరం చింతకాయమంద-1 సచివాలయాన్ని ఎంపీడీఓ తనిఖీ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ చింతలరాయుడు, మల్లారెడ్డి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

### ముస్లింలకు పవన్ క్షమాపణలు చెప్పాలి



మాట్లాడుతున్న టిమ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఖలీల్

గుంతకల్లుటౌన్: మత విద్వేషాలను రెచ్చగొట్టేలా ముస్లింలపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్న ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముస్లింలకు క్షమాపణలు చెప్పాలని టిప్పుసుల్తాన్ ఇత్తహాదుల్ ముస్లిమీన్ కమిటీ(టిమ్) రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎండీ.ఖలీల్, జిల్లా అధ్యక్షుడు ఎంబీ.మౌలా డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం పాతబస్టాండ్‌లోని కమిటీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జమ్మూకశ్మీర్‌లోని పెహల్గామ్‌లోని జరిగిన ఉగ్రదాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ ఘటనను సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి దాడికి కారకులైన దుండగులను కఠినంగా శిక్షించాలన్నారు. అయితే ముస్లింలను ఉగ్రవాదులుగా పవన్ అభివర్ణించడాన్ని వారు తప్పుబట్టారు. దేశంలో ఉగ్రవాద నిర్మూలనకు భారత ప్రభుత్వం తీసుకోబోయే చర్యలను తాము స్వాగతిస్తామన్నారు. కార్యక్రమంలో టిమ్ కమిటీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఖలందర్, ఇమ్రాన్, నాయకులు మసూద్, బాషా, సిలార్, షేక్షావలి, అబ్దుల్ బాసిద్‌లు పాల్గొన్నారు.